
ప్రజాశక్తి
గురువారం 4 జులై 2024
5
పార్వతీపురం మన్యం



ఇపిడిసిఎల్ యాప్‌లోనే బిల్లుల చెల్లింపు

ప్రజాశక్తి-సాలూరు

ఇక నుంచి విద్యుత్తు వినియోగదారులు తమ బిల్లులను ఇపిడిసిఎల్ యాప్‌లో గాని, సంస్థ వెబ్‌సైట్‌లో గాని చెల్లించాలని సంస్థ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇస్టర్న్ పవర్ అనే యాప్‌ని గూగుల్ ప్లే స్టోర్ నుంచి డౌన్లోడ్ చేసుకుని ఫోన్‌పే, గూగుల్ పే, పేటిఎం ద్వారా బిల్లులు చెల్లించుకోవాల్సి ఉంటుందని తెలిపారు. ఎపిఇపిడిసిఎల్ వెబ్‌సైట్‌లో నుంచి కూడా చెల్లింపులు చేయవచ్చునని చెప్పారు. నేరుగా ఫోన్ పే, గూగుల్ పే, పేటిఎం నుంచి చెల్లింపు చేయడం వల్ల సంస్థ పేరు కనిపించదని తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఒక ప్రకటనలో కోరారు.

మన్యానికి మలేరియా

రోగులతో ఆస్పత్రులు కిటకిట

వైద్యం కోసం క్యూకడుతున్న వైనం



రోగుల తాకిడితో కిటకిటలాడుతున్న భద్రగిరి ఆస్పత్రి



ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

మన్యానికి మలేరియా పట్టింది. వైద్యం కోసం వస్తున్న విద్యార్థులు, గిరిజన రోగులతో ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయి. ఒక్కో ఆస్పత్రిలో రోజువారి ఒపి 200కు చేరువైంది. వర్షాకాలం ప్రారంభంలోనే అధిక సంఖ్యలో విద్యార్థులు జ్వరాల బారిన పడుతున్నారు. భద్రగిరి ఆస్పత్రిలో మంచాలు చాలక ఒకే మంచంపై ఇద్దరు, ముగ్గురు విద్యార్థులు వైద్యం పొందుతున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మలేరియా మందులు లేక చాలామంది ప్రయివేటు వైద్యంపై ఆధారపడుతున్నారు. ఆర్థిక స్థోమత లేని వారు తప్పనిసరి పరిస్థితిలో ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లాల్సి వస్తోందని అంటున్నారు. పెరుగుతున్న రోగుల దృష్ట్యా సంబంధిత వైద్య ఆరోగ్య శాఖ అధికారులు స్పందించి మలేరియా మందులు అందుబాటులో ఉంచాలని, సేవలను మెరుగు పరచాలని, గ్రామాల్లో మలేరియా నివారణ చర్యలు చేపట్టాలని గిరిజన సంఘాల నాయకులు కోరుతున్నారు.



ఒకే మంచంపై ఇద్దరు, ముగ్గురు చొప్పున చికిత్స పొందుతున్న విద్యార్థులు



దళితులు సాగుచేస్తున్న భూములను పరిశీలిస్తున్న సిపిఎం సీనియర్ నాయకులు పి.మధు



డిఆర్‌ఒ కేశవనాయుడికి వినతి అందిస్తున్న సిపిఎం మాజీ ఎంపి పి.మధు

10 రోజుల్లో భూ సమస్య పరిష్కరించాలి

గరుగుబిల్లి మండలం శివ్వాం గ్రామంలో దళితులు సాగుచేస్తున్న భూములను సిపిఎం సీనియర్ నాయకులు, మాజీ ఎమ్‌పి పి.మధు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు, సిపిఎం సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి, జిల్లా కార్యదర్శి రెడ్డి వేణుతో కలిసి బుధవారం పరిశీలించారు. దళితులపై దాడి చేసిన పెత్తందారులను వెంటనే అరెస్టు చేయాలన్నారు. పెత్తందారులకు రెవెన్యూ అధికారులు కొమ్ముకాయడం సరికాదన్నారు. భూ సమస్యను పది రోజుల్లో పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేదంటే జిల్లా స్థాయిలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అనంతరం దళితులకు న్యాయం చేయాలని కలెక్టరేట్‌లో డిఆర్‌ఒ జి.కేశవనాయుడిని కలిసి వినతి అందజేశారు.

(పూర్తి వివరాలు.. మెయిన్‌లో)

జిఒ 3ను పునరుద్ధరించి

చిత్తశుద్ధి నిరూపించుకోండి

గిరిజన సంక్షేమ శాఖా మంత్రికి మాజీ మంత్రి రాజన్నదొర హితవు

ప్రజాశక్తి-సాలూరు

ఏజెన్సీ ప్రాంతంలో వంద శాతం ఉద్యోగాలు గిరిజనులకే దక్కాలన్న జిఒ 3ని పునరుద్ధరించి, చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని మాజీ మంత్రి రాజన్నదొర.. గిరిజన సంక్షేమ శాఖా మంత్రి సంధ్యారాణికి సూచించారు. బుధవారం పట్టణంలోని తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గిరిజన హక్కుల పరిరక్షణలో జగన్ ప్రభుత్వం విఫలమైందన్న గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి వ్యాఖ్యలపై ఆయన ఘాటుగా స్పందించారు. 2014 నుంచి 2019 వరకు టిడిపి ప్రభుత్వం హయాంలో జిఒ 3ని రక్షించడానికి అప్పటి సిఎం చంద్రబాబునాయుడు ఏమి చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టులో ఉన్న కేసులో గిరిజనులకు సంబంధించిన జిఒని రక్షించడానికి అప్పటి టిడిపి ప్రభుత్వం సమర్థులైన న్యాయవాదులను ఎందుకు నియమించలేదని ప్రశ్నించారు. 2020 ఏప్రిల్ 22న కరోనా ఉధృతంగా ఉన్న సమయంలో జిఒ 3ని రద్దు చేస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని తెలిపారు. దేశ వ్యాప్తంగా కరోనా లాక్‌డౌన్ అమలవుతున్న సమయంలో వైసిపి ప్రభుత్వం ఏమీ చేయలేదని నిందించడం తగదన్నారు. తర్వాత వైసిపి ప్రభుత్వ హయాంలో గిరిజన సలహా మండలి తీర్మానం చేసి రివ్యూ పిటిషన్ వేసినట్లు గుర్తుచేశారు. 2020లో జిఒ 3 పునరుద్ధరణ కోసం చట్టాన్ని చేసే అవకాశం ఉందా? లేదా? అని అప్పటి రాష్ట్ర అడ్వకేట్ జనరల్‌ని కోరామని చెప్పారు. తాను గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అయ్యాక ఐదో షెడ్యూల్ ప్రకారం గవర్నర్ ద్వారా ఆర్డినెన్సు తేవొచ్చునా? లేదా చెప్పాలని లేఖ రాసినట్లు గుర్తుచేశారు. సుప్రీంకోర్టులో కేసు పెండింగ్‌లో ఉండగా ఆర్డినెన్సు తీసుకురాకూడదని అడ్వకేట్ జనరల్ చెప్పారని తెలిపారు. ఇటీవల ఎన్నికల్లో టిడిపి మేనిఫెస్టోలో కూడా జిఒ 3 పునరుద్ధరణ హామీ ఉందని చెప్పారు. ఎన్నికల ప్రచారంలో మంత్రి సంధ్యారాణి కూడా హామీ ఇచ్చారని తెలిపారు. ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. షెడ్యూల్ గ్రామాల జాబితాలో లేని గ్రామాలను చేర్చి జిఒ 3ని పునరుద్ధరిస్తే గిరిజనులు హర్షిస్తారని చెప్పారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి రాజన్నదొర

గిరిజనులకు ఎవరి హయాంలో ఎక్కువ ఆర్ఒఎఫ్ఆర్ పట్టాలు పంపిణీ చేశారో సంబంధిత అధికారులను అడిగితే చెపుతారన్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో సుమారు 3లక్షల ఎకరాల భూమిని సుమారు లక్షా 57 వేల మంది గిరిజన రైతులకు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. అరకు ప్రాంతంలో బాక్సైట్ తవ్వకాల కోసం 2015లో టిడిపి ప్రభుత్వమే జిఒ 97ని జారీ చేసిందని తెలిపారు. వైసిపి ప్రభుత్వం ఎక్కడైనా చట్టాలను అతిక్రమిస్తే చర్యలు తీసుకోవచ్చునని చెప్పారు. అబద్దాలను నిజమని ప్రచారం చేసినంత మాత్రాన ప్రజలు నమ్మరని హితవుపలికారు.

అరకు ఎమ్‌పిపై విమర్శలు సరికాదు

తొలిసారి ఎన్నికైన వైసిపి అరకు ఎమ్‌పి డాక్టర్ తనూజా రాణి పార్లమెంటులో చక్కగా మాట్లాడారని రాజన్నదొర చెప్పారు. రాష్ట్రం ఎదుర్కొంటున్న సమస్యల్ని మాత్రమే ప్రస్తావించారని తెలిపారు. జిఒ 3 పునరుద్ధరణ, ఎపికి ప్రత్యేక హోదా వంటి అంశాలపై తనూజా రాణి మాట్లాడడం హర్షణీయమని చెప్పారు. అలాంటి గిరిజన యువ నాయకురాలు ఎమ్‌పిగా మాట్లాడిన తీరును హర్షించకుండా మంత్రి సంధ్యారాణి విమర్శలు చేయడం సరికాదన్నారు.

మెరుగైన సేవలు అందించండి : ఎమ్మెల్యే

పాలకొండ : ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలని ఎమ్మెల్యే నిమ్మక జయక్రిష్ణ ఆర్‌టిసి అధికారులకు సూచించారు. బుధవారం స్థానిక ఆర్‌టిసి డిపోలో నూతనంగా ఏర్పాటుచేసిన బస్సును ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా చూసుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాలకు ఆర్‌టిసి సేవలు విస్తరించాలని అన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ వెంకటేశ్వరరావు, నాయకులు గండి రామినాయుడు ఉన్నారు.

ఇళ్ల స్థలాల కొనుగోలులో అవినీతి

ఎక్కడ, ఎంత నిధులతో కొన్నారో నివేదిక సిద్ధం చేయండి ● అధికారులకు ఎమ్మెల్యే జయకృష్ణ ఆదేశం

ప్రజాశక్తి-వీరఘట్టం

గత ప్రభుత్వ హయాంలో జగనన్న ఇళ్ల స్థలాల కొనుగోలులో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ఆరోపించారు. బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షలో ఆయన మాట్లాడారు. అచెప్పవలస సమీపంలో జగనన్న ఇళ్ల స్థలాల కోసం డి-పట్టా భూములు కొనుగోలు చేసి లక్షలాది రూపాయలు పెద్దల చేతుల్లో చేరాయని తెలిపారు. ఇళ్ల స్థలం ఒకరి పేరిట, నిర్మాణాలు ఇంకొకరి పేరిట ఉన్నాయన్నారు. మండలంలో అనర్హులకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారని ఆరోపించారు. వీటిపై ఎక్కడెక్కడ ఎంత భూమి కొనుగోలు చేశారు? ఎంత నిధులు ఖర్చు చేశారు? సమగ్ర నివేదిక ఇవ్వాలని తహశీల్దార్ కె.జయప్రకాశ్‌ను ఆదేశించారు. తోటపల్లి ప్రధాన ఎడమ కాలువ ఆధునికీకరణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించలేదన్నారు. దీంతో కాలువ అధ్వానంగా దర్శనమిస్తోందని చెప్పారు. ఈ ఏడాది సాగునీరు రైతులకు పూర్తిస్థాయిలో అందిస్తారా? లేదా? అని ఇరిగేషన్ ఇన్‌ఛార్జి ఎఇఇ కె.రాజేష్‌ను ప్రశ్నించారు.

నడుకూరు గుమ్మడ, కొట్టుగుమ్మడ, గడగమ్మ, కిమ్మి, తదితర గ్రామాలకు సాగునీరు అందడం లేదని కొంతమంది ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. అవసరం లేని చోట ఉపాధి పనులు చేస్తున్నారని, రైతులకు ఉపయోగపడే కాలువల్లో పనులు చేయడం లేదని, సాగునీరు అందక వర్షాలపై ఆధారపడి పంటలు సాగు చేస్తున్నామని వివరించారు. వెంటనే ఎమ్మెల్యే స్పందిస్తూ ఉపాధి ఎపిఒ, ఇరిగేషన్ ఎఇఇలకు పనులు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. వండువ గ్రామంలో రాయుడు చెరువులో గత మూడేళ్ల నుంచి ఉపాధి పనులు చేపట్టడం లేదని, ఉపాధి పనులు చేపట్టాలని తీర్మానం కూడా చేసినట్లు గ్రామానికి చెందిన కొంతమంది ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. రాయుడు చెరువులో ఉపాధి పనులు చేపట్టాలని ఉపాధి ఎపిఒ జి.సత్యంనాయుడును ఎమ్మెల్యే ఆదేశించారు.

గ్రామాల్లో విదుత్త్ సమస్య ఏర్పడుతుందని, ఎప్పటికప్పుడు లోవోల్టేజ్ కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని సమావేశంలో కొంతమంది సభ్యులు ప్రస్తావించారు. వెంటనే చర్యలు తీసుకోవాలని సంబంధిత ఎఇ డి.బాలాజీకి ఎమ్మెల్యే సూచించారు. మరోసారి ఇటువంటి సమస్యపై ఫిర్యాదు రాకుండా చూసుకోవాలన్నారు. గతంలో 21 రైతు సంఘాలకు 21 ట్రాక్టర్లు కొనుగోలు చేశారని, అవి రైతుల వద్ద ఉన్నాయా? పాలకుల వద్ద ఉన్నాయా? వీటిపై సమగ్ర దర్యాప్తు చేసి తమకు వివరాలు అందజేయాలని ఎఒ సౌజన్యను ఆదేశించారు.

సమావేశంలో ఎంపిడిఒ ఎంవిబి సుబ్రహ్మణ్యం, తహశీల్దార్ కె.జయప్రకాశ్, వివిధ శాఖల అధికారులు, పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ

ఎమ్మెల్యే జయకృష్ణకు సన్మానం

వీరఘట్టం : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం ఎంపిడిఒ ఎంవిబి సుబ్రహ్మణ్యం, కార్యాలయ సిబ్బంది.. ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణను ఘనంగా సన్మానించారు. తొలుత ఆయనకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు పి.కృష్ణమూర్తి నాయుడు, మండల, పట్టణ అధ్యక్షులు ఉదయాన ఉదయ భాస్కర్, జామి లక్ష్మీనారాయణ, బల్ల హరిబాబు, మండల కార్యదర్శి సిహెచ్ ఉమామహేశ్వరరావు, పట్టణ అధ్యక్షులు జామి లక్ష్మీనారాయణ, పొన్నాడ నాగేశ్వరరావు, బల్ల హరిబాబు, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షులు పారిచర్ల వెంకటరమణ, మండల అధ్యక్షులు మాచర్ల అనిల్‌బాబు పాల్గొన్నారు.

గత ప్రభుత్వ విద్యా విధానాన్ని రద్దుచేయాలి

ప్రజాశక్తి పార్వతీపురంరూరల్

గత ప్రభుత్వంలో అమలు చేసిన విద్యా విధానాన్ని వెంటనే రద్దుచేసి, ఎప్పటిలాగే కామన్ స్కూల్ విధానాన్ని తీసుకురావాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.మురళి, ఎస్.మురళీమోహనరావు ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం యుటిఎఫ్ ఆఫీస్ బేర్ల సమావేశంలో వారు మాట్లాడారు. గత ప్రభుత్వం అనుసరించిన విధానాల వల్ల ప్రాథమిక విద్యారంగం మొత్తం నాశనమైందన్నారు. విద్యార్థుల చేరికలు లక్షలాదిగా తగ్గిపోయాయని చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వం స్పందించి కామన్ స్కూల్ విధానాన్ని అమలుపరిచే ఆవశ్యకతను గుర్తించాలన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు కె.మురళి, వి.జ్యోతి, గోవిందమ్మ, ఎం.శ్రీను, రాంబాబు, శంకరరావు, పి.వెంకట నాయుడు తదితరులు పాల్గొన్నారు.



కమిషనర్‌తో మాట్లాడుతున్న క్లాప్ డ్రైవర్లు

బకాయి వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

బకాయి వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని 11 మంది క్లాప్ డ్రైవర్లు మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాస్‌ను కోరారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్‌ను క్లాప్ డ్రైవర్లు కలిసి, సమస్యలను వివరించారు. మూడు నెలల వేతనాలను, 7 నెలల పిఎఫ్ బకాయిలను సంబంధిత కాంట్రాక్టర్ చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఉమ్మడి జిల్లాలలో ఉన్న ఏ మున్సిపాలిటీలో కూడా క్లాప్ డ్రైవర్ల వేతనాల బకాయిలు లేవని చెప్పారు. పార్వతీపురం మున్సిపాలిటీలో మాత్రమే పెండింగ్ లో ఉన్నాయన్నారు. ఈ సమస్య పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన కమిషనర్ మాట్లాడుతూ ఈ మున్సిపాలిటీ ద్వారా ప్రతినెలా వేతనాలను సంబంధిత కాంట్రాక్టర్‌కు చెల్లించామన్నారు. సంబంధిత కాంట్రాక్టర్ కార్యాలయానికి వెళ్లి మాట్లాడాలని సూచించారు.

రైతు సేవా కేంద్రాలను వినియోగించుకోండి

మంత్రి శ్రీనివాస్

ప్రజాశక్తి-గంట్యాడ

రైతు సేవా కేంద్రాలను వినియోగించుకోవాలని రాష్ట్ర సూక్ష్మ చిన్న మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని మదనాపురంలో గ్రామ సచివాలయ భవనం, రైతు భరోసా కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసార పరీక్ష నివేదిక ఆధారంగా పంట రకాలను ఎంపిక చేసుకొని సాగు చేయడం వల్ల ఆర్థికంగా అభివృద్ధి సాధించ వచ్చునని అన్నారు. రైతులు సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని తెలిపారు. వ్యవసాయశాఖ అధికారులు రైతులకు ఎప్పటికప్పుడు సూచనలు అందించాలని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ ఎంవి సూర్యకళ, డిపిఒ శ్రీధర్‌రాజా, ఎంపిపి హైమావతి, జెడ్‌పిటిసి వర్రి నరసింహ మూర్తి, సర్పంచ్ జె.పాపారావు, మాజీ ఎంపిపి కొండపల్లి కొండలరావు, టిడిపి మండల అధ్యక్షుడు కొండపల్లి భాస్కర నాయుడు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్

ఎస్‌కెపాడు పార్కు పరిశీలన

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

మండలంలోని ఎల్విన్‌పేట పంచాయతీ పరిధిలోని సవరకోటపాడు పార్కును పార్వతీపురం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి విష్ణుచరణ్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పార్కులో పర్యాటకుల కోసం ఏర్పాటు చేసిన క్రీడ, వినోద సౌకర్యాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో భద్రగిరి ఐటిడిఎ ఇంజనీరింగ్ డిఇ సింహాచలం, ఎఇ అప్పారావు ఉన్నారు.



ఎస్‌కె పాడు పార్కును పరిశీలిస్తున్న పిఒ విష్ణు చరణ్

నేడు అల్లూరి జయంతి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

జిల్లాలో గురువారం అల్లూరి జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించనుండటంతో గురువారం ఉదయం 10:30 గంటలకు కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆ ఉత్సవాలు నిర్వహించనున్నారు. అధికారులు,సెక్షన్ సూపరింటెండెంట్‌లు, కార్యాలయ సిబ్బంది అందరూ తప్పనిసరిగా హాజరు కావాలని కలెక్టర్ తెలిపారు. జిల్లా అధికారులు, డివిజనల్ అధికారులు, తహశీల్దార్లు.. అల్లూరి సీతారామరాజు జయంతి ఉత్సవాలను వారి కార్యాలయాల్లో నిర్వహించాలని కలెక్టర్ సూచించారు.

ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024

ఎంట్రీలకు ఆహ్వానం

ప్రియమైన మిత్రులారా!



ప్రజాశక్తి దిన పత్రిక వ్యవస్థాపక సంపాదకులు మోటూరు హనుమంతరావు స్మృత్యర్థం పాత్రికేయ రంగంలో ఉత్తమ కృషి చేసిన జర్నలిస్టులను సత్కరించేందుకు ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డును నెలకొల్పి రెండు దశాబ్దాలు దాటింది. కోవిడ్ కాలం మినహా ప్రతి యేటా క్రమం తప్పకుండా ఈ పురస్కారాన్ని ప్రజాశక్తి సాహితీ సంస్థ అందజేస్తూ వస్తున్నది. 2024 సంవత్సరానికి ఉత్తమ జర్నలిస్టు అవార్డు కోసం ఎంట్రీలను ఆహ్వానిస్తున్నది. సీనియర్ పాత్రికేయులు తెలకపల్లి రవి అధ్యక్షతన నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగం అధిపతి ప్రొఫెసర్ జి అనిత, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావుతో కూడిన త్రిసభ్య కమిటీ ఈ ఏడాది అవార్డు కోసం ఏదేని అంశంపై మానవాసక్తికర వార్తా కథనాలను ఎంట్రీలుగా ఆహ్వానించాలని నిర్ణయించింది. 2023 మే 1నుంచి 2024 జూన్ 18వ తేదీ వరకు తెలుగు దిన పత్రికల్లో ప్రచురితమైన మానవాసక్తికర కథనాలను మాత్రమే పంపాలి. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన జర్నలిస్టులు ఎంట్రీలు పంపవచ్చు. ఎంట్రీతోపాటు ఇది నా సొంత రచన, ఎవరినీ అనుకరించినది కాదు అని స్వీయ ధ్రువీకరణ పత్రం జతచేసి పంపాలి. ఒక వ్యక్తి రెండు కథనాలకు మించి పంపకూడదు. తమ దృష్టికి వచ్చిన ఇతరుల కథనాలను ఎవరైనా సూచించవచ్చు కూడా. ప్రజాశక్తి సంస్థ జర్నలిస్టులు ఈ విభాగంలో పంపనవసరం లేదు. ఎంట్రీలు 2024 జులై 18 నాటికల్లా మాకు అందేట్లు చూడాలి. కవర్‌పై 'ఎం హెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024 కోసం' అని స్పష్టంగా పేర్కొనాలి. ఇ-మెయిల్ ద్వారా కూడా పంపవచ్చు. అవార్డు విజేతకు 2024 ఆగస్టులో జరిగే ఎంహెచ్ స్మారకోపన్యాస సభలో జ్ఞాపిక, రూ.10 వేలు నగదు ఇచ్చి సముచిత రీతిలో సత్కరించడం జరుగుతుంది.

ఎంట్రీలు పంపాల్సిన చిరునామా

ప్రజాశక్తి సాహితీ సంస్థ,
ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ,
తాడేపల్లి, గుంటూరు జిల్లా,
పిన్‌కోడ్-522501, ఇ మెయిల్
అడ్రస్: psmhaward@gmail.com

కార్యదర్శి

(ఎంవిఎస్ శర్మ)
ప్రజాశక్తి సాహితీ సంస్థ

6న జునోసిస్ డే

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

ఈ నెల 6న జునోసిస్ డే సందర్భంగా జిల్లాలోని అన్ని పశు వైద్య కేంద్రాలలో పెంపుడు కుక్కలకు ఉచితంగా టీకాలు అందజేస్తున్నట్లు జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి ఎస్.మన్మథరావు ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకొని జిల్లావ్యాప్తంగా రేబీస్ రాకుండా తమ పెంపుడు కుక్కలకు టీకాలు వేయించుకోవాలని సూచించారు. ఇందుకుగాను 10,380 డోసులను సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు.

ప్రజల సహకారంతోనే పంచాయతీ అభివృద్ధి

ప్రజాశక్తి -గరుగుబిల్లి

మండలంలో రావుపల్లి, రావివలస, మరుపెంట గ్రామాలలో బుధవారం గ్రామసభలు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా మరుపెంట సభలో ఎంపిపి ఉరిటి రామారావు మాట్లాడుతూ ప్రజల సహకారం ఉంటేనే పంచాయతీలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. గ్రామపంచాయతీని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు అవసరమైన ప్రణాళికలను తయారు చేయాలని తెలిపారు. సమావేశాల్లో సర్పంచులు ఉరిటి నిర్మల, బొంతాడ మహేష్, ఉప సర్పంచ్ గుంట్రెడ్డి పద్మావతి, కండేన బలరాం నాయుడు, అక్కేన రామక్రిష్ణ, గులిపల్లి రామారావు, సచివాలయ సిబ్బంది గంట జనార్ధనరావు, రెడ్డి కుంతి తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

ప్రజాశక్తి-సీతంపేట

స్థానిక ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో బుధవారం అగ్ని ప్రమాదాలు- వాటి నివారణపై విద్యార్థులకు పాలకొండ అగ్నిమాపక అధికారి జె.సర్వేశ్వరరావు అవగాహన కల్పించారు. ప్రమాదం జరిగేటప్పుడు ఎలా ఎదుర్కోవాలో మెలకువలు నేర్పించారు. ప్రమాదాలు మొదటి దశలో ఉన్నప్పుడు ఏ విధంగా ఎదుర్కోవాలో తెలియజేశారు. గాయపడిన వారికి సురక్షితంగా తీసుకువెళ్లి వైద్యం అందించడం, జాకెట్ వినియోగంపై వివరించారు.

పోలమాంబ హుండీ ఆదాయం రూ 4.41 లక్షలు

ప్రజాశక్తి-మక్కువ

శంబర పోలమాంబ అమ్మవారి ఆలయ హుండీలను బుధవారం లెక్కించారు. చెదురుగుడి ఆలయం నుండి రూ.2,28,109, వనం గుడి నుంచి రూ.1,93,233.. మొత్తం రూ.4,21,342 ఆదాయం వచ్చినట్లు ఇఒ వివిఎస్ నారాయణ తెలిపారు. కార్యక్రమంలో బొబ్బిలి తనిఖీదారు ఎన్.రాజ కుమారి, ఎంపిటిసి తీళ్ల పోలినాయుడు, మాజీ చైర్మన్ దాలినాయుడు, వై.సింహాచలం, సర్పంచ్ అల్లు వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.



టార్పాలిన్లు అందజేస్తున్న టిడిపి నాయకులు శంకరరావు

డ్రమ్ములు, టార్పాలిన్లు పంపిణీ

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మండలంలో బందలుప్పి గ్రామంలో ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా పేద దళితులకు టార్పాలిన్లు, డ్రమ్ములను ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర ఆదేశాలతో బుధవారం టిడిపి గ్రామ ఇన్‌ఛార్జి శంకరాపు శంకర్రావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ పనుల్లో ఉపయోగపడేందుకు 25 మంది దళితులకు డ్రమ్ములు, టార్పాలిన్లు ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. వాటిని సద్వినియోగం చేసుకునేలా సచివాలయ సిబ్బంది సమక్షంలో లబ్ధిదారులకు పంపిణీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఆర్నిపల్లి వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్లు అందజేత

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురం పాలిటెక్నికల్ కళాశాలలో ప్రధానమంత్రి కౌసల్య వికాస యోజన పథకంలో డేటా ఎంట్రీ, సెయింగ్ ఆపరేటర్, రిసెప్షనిస్ట్ విభాగాల్లో శిక్షణ పొందిన యువతకు బుధవారం భద్రగిరి ఐటిఐ ప్రిన్సిపల్ సిహెచ్ సునీల్ కుమార్ సర్టిఫికెట్లు అందజేశారు. శిక్షణ పొందిన అభ్యర్థులు తమ సర్టిఫికెట్లతో ఉద్యోగ అవకాశాలు పొందాలని సూచించారు. 70 మంది నిరుద్యోగ యువతకు పై విభాగాలలో మూడు నెలల శిక్షణ ఇచ్చినట్లు పాలిటెక్నికల్ ప్రిన్సిపల్ భానుప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ మేఘాలయ పాల్గొన్నారు.



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఎస్‌బిఐ బ్రాంచి మేనేజర్ సాయిరాజు

క్రికెట్ టోర్నీ విజేత అచ్చప్పవలస

ప్రజాశక్తి-సీతంపేట

మండలంలో దేవనపురంలో నిర్వహించిన క్రికెట్ టోర్నీ విజేతగా అచ్చప్పవలస జట్టు నిలిచింది. బుధవారం జరిగిన ఫైనల్లో కె.కొత్తగూడపై అచ్చప్పవలస విజయం సాధించింది. ఎస్‌బిఐ సీతంపేట బ్రాంచి మేనేజర్ సాయిరాజు ముఖ్యఅతిథిగా హాజరై బహుమతులు ప్రదానం చేశారు. సూరిబాబు మాస్టారు, ప్రభాకర్, ప్రకాష్ రావు, రవి, జగన్, తదితరులు పాల్గొన్నారు.

సిఎం చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి-సీతానగరం

పింఛను పెంచిన నేపథ్యంలో పెదబోగిలి గ్రామంలో పెదబోగిలి వికలాంగుల సంఘం ఆధ్వర్యంలో సిఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు బుధవారం పాలాభిషేకం చేశారు. అనంతరం కేకులు కట్ చేసి గ్రామస్తులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జొన్నాడ తేరేజమ్మ గరికయ్య, మాజీ సర్పంచ్ బి.శ్రీనివాసరావు, టిడిపి నాయకులు సాల హరి గోపాలరావు, కొల్లి అప్పలనాయుడు, కె.ఈశ్వరరావు పాల్గొన్నారు.

భార్య మందలించిందని ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

ప్రతిరోజూ మద్యం సేవించి వస్తున్న భర్తను భార్య మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన భర్త పత్తి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ప్రస్తుతం పార్వతీపురం జిల్లా కేంద్రాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. కురుపాం మండలం గుంజరాడ గ్రామానికి చెందిన బిడ్డిక రవి పని చేయకుండా ప్రతిరోజూ మద్యం తాగి ఇంటికి రావడంతో భార్య మందలించింది. ఇద్దరి మధ్య గొడవ పెరగడంతో భర్త రవి.. ఇంట్లో ఉన్న పత్తిమందు తాగాడు. గమనించిన భార్య, బంధువులు వైద్యం కోసం భద్రగిరి ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు.

పశు వ్యాధులపై అప్రమత్తం

ప్రజాశక్తి - సీతంపేట

కాలం, వాతావరణాన్ని బట్టి మానవుల మాదిరిగానే పశువులకు వివిధ రకాల వ్యాధులు వస్తుంటాయి. సీజనల్ వ్యాధులు, ఒంటివ్యాధులు, ఇతర వ్యాధుల నుంచి మూగజీవాలను కాపాడుకోవాలి. వర్షాకాలంలో పరిసరాల ప్రభావం, వరద నీరు, మొలిచిన పచ్చిక, గడ్డిపైన ఉండే కీటకాలు, కలుషితమైన మేత తినడం వల్ల పశువులు, మేకలు, గొర్రెలకు పలు రకాల వ్యాధులు సోకుతాయి. దీనివల్ల వ్యాధి నిరోధశక్తి తగ్గిపోయి అంటువ్యాధులు బారినపడి చివరికి మరణించే ప్రమాదం ఉంటుంది. సాధారణంగా పశువుల్లో వర్షాకాలం వచ్చే ముఖ్యమైన వ్యాధులు, వాటి నివారణ గురించి వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసరావు సూచనలు, సలహాలు పాడి రైతుల కోసం...



వర్షాకాలంలో పాడి రైతులు జాగ్రత్తగా ఉండాలి : ఎడి శ్రీనివాసరావు

గాలి కుంటు వ్యాధి సంచలు

ఇది వైరస్ సోకడం లేదా కలుషితమైన గాలి ద్వారా వస్తుంది. తల్లి పాల ద్వారా దూడలకు కూడా వచ్చే అవకాశం ఉంటుంది. ప్రతి ఏడాది వర్షాకాలంలో విరివిగా గేదెలు, ఎద్దులు, ఆవులకు గాలి కుంటివ్యాధి సోకుతుంది. గిట్టలు ఉన్న ప్రతిచోట జీవికి ఈ అంటువ్యాధి వస్తుంది. వ్యాధి సోకిన సమయంలో 104 నుంచి 105 డిగ్రీల వరకు ఉష్ణోగ్రత ఉంటుంది. నోటిలో, గిట్ల మధ్య పుండ్లు పుడతాయి. పశువులు నడవలేని స్థితిలో ఉంటాయి. అధికంగా మార్చి, ఏప్రిల్, సెప్టెంబర్, అక్టోబర్‌లో ఈ వ్యాధి పశువులకు వచ్చే ప్రమాదం ఉంది

నివారణ.. ఈ వ్యాధి సోకిన పశువును మంద నుంచి ముందు వేరు చేయాలి. నోటిలోని పుండ్లకు బోరిక్ పౌడర్ గ్లిసరిన్ కలిపి పూయాలి. గిట్టల మధ్య పుండ్లకు వర్మంగ్ నెట్ ద్రావణంతో శుభ్రం చేసి వేప నూనె రాయాలి. యాంటీ బయోటిక్స్ పెయిన్ కిల్లర్ వాడితే ఉపశమనం కలుగుతుంది.

జబ్బ వాపు వ్యాధి

ఈ వ్యాధి క్లా స్టేడియం చోవై అనే బ్యాక్టీరియా ద్వారా పశువులకు సోకుతుంది. ఆరు మాసాల నుంచి రెండేళ్లలోపు వయస్సున్న పశువులకు అధికంగా సోకు తుంది. ఈ వయసులో పశువుకు రోగ నిరోధక శక్తి చాలా తక్కువగా ఉంటుంది. భుజం, తొడ ప్రాంతాల్లోని కండ రాలు నుంచి ఆశించి మాంసం కూలిపోయేలా చేస్తుంది. కుంటుతాయి. వాపు దగ్గర కరకరమైన శబ్దం వస్తుంది.

నివారణ.. ఈ వ్యాధి ప్రారంభంలోనే పెన్సిల్ వంటి యాంటీ బయోటిక్స్ వాడాలి వ్యాధిగ్రస్తు పశువును వేరు చేయాలి. చనిపోయిన పశువు ఉన్నట్లయితే గొయ్యిలో పాతిపెట్టాలి. వ్యాధి రాకుండా వర్షాకాలం ముందే ప్రభుత్వం అందించిన జబ్బు వ్యాపు వ్యాధి టీకాలు వేయించుకోవాలి.

గొర్రెల్లో నీలి నాలుక వ్యాధి

దోమ కాటు వైరస్ వల్ల గొర్రెలు, మేకలకు నీలినాలుక వ్యాధి వర్షాకాలంలో విరివిగా వస్తుంది. సొంగ కారుతుంది. దీన్నే మూతి వాపు వ్యాధి అని అంటారు. నాలుక చివరిలో నీలిరంగు వస్తుంది. కాళ్ల గిట్టల చుట్టూ వాచి పుండ్లు అవుతాయి. ఆహారం తీసుకోకపోవడంతో ఆరోగ్యం క్షీణించి వారం రోజుల్లో చనిపోతుంది.

నివారణ.. వ్యాధి సోకిన గొర్రెలను సకాలంలో గుర్తించి వైద్యులతో చికిత్స చేయించాలి. నోటి పుండ్లను ఒక శాతం బోరిక్ యాసిడ్ లోషన్‌తో శుభ్రం చేయాలి. రెండు శాతం బోరో గ్లిసరిన్ పూయాలి. వైద్యుల సలహా మేరకు యాంటీబయోటిక్ ఇంజక్షన్ వేయాలి. ఆహారం జావా లాంటిది తాగించాలి.

గొంతు వాపు వ్యాధి

వర్షాకాలంలో పశువులకు ప్రధానంగా వచ్చేది గొంతు వాపు వ్యాధి. దీనికి గురక వ్యాధి అని కూడా అంటారు. వర్షాకాలంలో పశువులకు సూక్ష్మజీవుల వల్ల ఈ వ్యాధి సంక్రమిస్తుంది. ఇది అంటువ్యాధిగా ఇతర పశువులకు సోకుతుంది. కలుషితమైన నీరు, మేత ద్వారా రోగనిరోధక శక్తి తగ్గి వ్యాధి బారిన పడుతాయి. కంటి నుంచి నీరు, నోటు నుంచి చొంగలు కారుస్తూ , గురక శ్వాస పీల్చడం కష్టమవుతుంది. పశువు ఆయాస పడుతూ శ్వాస పీలుస్తుంది. జ్వరం 104 నుంచి 106 డిగ్రీల వరకు ఉంటుంది. అనంతరం గొంతు వ్యాపు వస్తుంది. ఈ వ్యాధి వచ్చిన పశువులు 24 గంటల్లో మరణించే అవకాశాలు ఉంటాయి.

నివారణ.. వర్షాకాలం ముందు మే నెలలో వ్యాధి నిరోధక టీకాలు చేయించుకోవాలి. వ్యాధి ఉన్న పశువుల దొడ్డిని క్రిమిసంహారక మందులతో శుభ్రం చేయాలి. వ్యాధి లక్షణాలు కనిపించిన పశువును వెంటనే మంద నుంచి వేరు చేయాలి. వ్యాధి సోకిన పశువుకు వ్యాధి తీవ్రతను బట్టి స్వల్ప డిమిడిన్ యాక్సెప్ట్ వంటి ఇంజక్షన్లు ఇవ్వాలి. ఇతర పశువులకు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. సమీప వైద్య అధికారులను సంప్రదించాలి

కుందేటి వెర్రి

ఈ వ్యాధి వర్షాకాలంలో జోరీగల ద్వారా పశువులకు సంక్రమిస్తుంది. రక్తంలో ఉండే పరాన్న జీవులు వల్ల బర్రెలు, ఆవులు, గొర్రెలు, మేకలు, కుక్కలు ఎక్కువగా సోకుతుంది. జోరీగల వల్ల ఎక్కువగా వ్యాప్తి చెందుతాయి. వ్యాధి సోకిన పశువులకు జ్వరం, ఫిట్స్ వస్తుంది. పండ్లు కొరుకుతాయి. పాల ఉత్పత్తి తగ్గుతుంది.

నివారణ.. ఈ వ్యాధి నివారణకు వైద్యులను సంప్రదించి పరిశుభ్రంగా ఉంచాలి. వ్యాధి సోకిన పశువులను వేరుగా ఉంచాలి.

సమస్యలపై దృష్టి సారించాలి

అధికారులకు ఎమ్మెల్యే ఆదేశం

ప్రజాశక్తి -భామిని

ప్రజల సమస్యలు మీ దృష్టికి వస్తే పరిష్కార మార్గాలపై దృష్టిసారించాలని ఎమ్మెల్యే జయకృష్ణ.. అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఖరీఫ్‌లో రైతులకు పూర్తి స్థాయిలో ఎరువులు అందుబాటులో ఉంచాలన్నారు. రైతులు సూచించిన స్థలంలో ఎరువుల స్టాక్ పాయింట్ ఏర్పాటుపై దృష్టి సారించాలన్నారు. గతంలో రైతు సంఘాలకు సబ్సిడీపై ఇచ్చిన ట్రాక్టర్, హార్వెస్టర్లు ప్రస్తుతం కనిపించడం లేదని, వాటిని తీసుకున్న వారికి నోటీసు ఇచ్చి, రికవరీ చేయాలని ఆదేశించారు. పిఎం కిసాన్ రాని రైతుల సాంకేతిక సమస్యలను పరిష్కరించాలని ఎఒ మన్మథరావుకు సూచించారు. మండలంలో నీటి సమస్యలు లేకుండా చూడాలని ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ సందీప్‌కి సూచించారు. గతంలో ఎన్‌ఆర్‌ఇజిఎ నిధులతో రైతులు అవసరాల మేరకు చేపట్టిన గోకులాలు ఎందుకు పూర్తి చేయలేదని ఎపిఎం



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయకృష్ణ

తులసీదాస్‌ని ప్రశ్నించారు. భామిని మండలంలోని పిహెచ్‌సి నుంచి కేసులు ఎక్కువగా రిఫర్ చేస్తున్నారని ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. డెంగీ, మలేరియా వ్యాధులు నియంత్రణకు గ్రామాలలో చర్యలు తీసుకోవాలన్నారు. పిహెచ్‌సిలో పూర్తి స్థాయిలో మందులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. వైద్య సిబ్బంది, పంచాయతీ రాజ్ సిబ్బంది కలిసి గ్రామాలలో పూర్తి స్థాయి శానిటేషన్ చేస్తే వ్యాధులు అదుపుచేయవచ్చన్నారు. సమావేశంలో ఎంపిడిఒ రావాడ కిశోర్‌కుమార్, తహశీల్దార్ శ్రీనివాసరావు, టిడిపి మండల అధ్యక్షులు రవినాయుడు, ప్రధాన కార్యదర్శి మెడిబోయిన జగదీశ్వరరావు, మాజీ ఎంపిపి భూపతి ఆనందరావు, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాస్ అన్నారు. బుధవారం మున్సిపల్ కూరగాయల, చేపల మార్కెట్లో చేపడుతున్న పారిశుధ్య పనులను ప్రజారోగ్య విభాగం అధికారి సిహెచ్ మురళితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా చేపల మార్కెట్‌లో ఉన్న వ్యాపారులతో కమిషనర్ మాట్లాడారు. రానున్న రెండు నెలలు వర్షాలు అధికంగా కురుస్తాయని, దీనివల్ల వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని తెలిపారు. చేపల కొనుగోలుకు వచ్చిన ప్రజలకు ఎలాంటి అసౌకర్యమూ కలగకుండా, అనారోగ్యం బారిన పడకుండా ఉండేందుకు మీరంతా చేపల మార్కెట్‌ను పరిశుభ్రమైన వాతావరణంలో ఉంచాలని సూచించారు.

పాఠశాల సందర్శన

ప్రజాశక్తి - కురుపాం

కురుపాంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను డిప్యూటీ డిఇఒ కృష్ణమూర్తి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆధ్వర్యాన ఏడుగురు సబ్జెక్ట్ నిపుణుల బృందం పాఠశాలలో తనిఖీ నిర్వహించింది. పాఠశాల రికార్డులతోపాటు ఉపాధ్యాయుల పనితీరును పరిశీలించి సమీక్ష నిర్వహించారు. విద్యార్థులకు నాణ్యతా ప్రమాణాలతో కూడిన విద్యను అందించడానికి ఉపాధ్యాయులంతా కృషి చేయాలని కృష్ణమూర్తి సూచించారు. అనంతరం డిప్యూటీ డిఇఒ కృష్ణమూర్తిని ప్రధానోపాధ్యాయుడు తోట శంకరరావు, ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి నిమ్మక సత్యనారాయణ, ప్యానెల్ ప్రధానోపాధ్యాయులు భీముడు, కుమార్ పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డిప్యూటీ డిఇఒ కృష్ణమూర్తి

గ్రామాల్లో వైద్య శిబిరాలు



గరుగుబిల్లి.. గర్భిణులకు పరీక్షలు చేస్తున్న డాక్టర్ సాగర్ వర్మ

ప్రజాశక్తి -గరుగుబిల్లి

మండలంలో కొత్తూరు గ్రామంలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని వైద్యులు సాగర్ వర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. గర్భిణులకు రక్త హీనత, హైరిస్క్ సమస్యలు తలెత్తకుండా వైద్య సిబ్బంది కృషి చేయాలని ఆయన సూచించారు. మాత, శిశు సంరక్షణ కార్డులో ఆరోగ్య తనిఖీలు, వైద్య పరీక్షల వివరాలు పరిశీలించి నివేదికల్లో హెచ్చుతగ్గులు గుర్తించారు. గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. జ్వర లక్షణాలు గుర్తిస్తే హైరిస్క్‌గా పరిగణించి సత్వరమే సమాచారం ఇవ్వాలన్నారు. పిహెచ్‌సిలో సాధారణ ప్రసవాలు జరిగేలా సిబ్బంది చర్యలు చేపట్టాలన్నారు. అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి. పిల్లల ఆరోగ్యం గురించి ఆరాతీశారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు రవణమ్మ, స్వాతి, సావిత్రి, దుర్గాప్రసాద్, శంకరావు, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

సీతానగరం : మండలంలోని బుద్ధిపేట గ్రామంలో బుధవారం సీతానగరం పిహెచ్‌సి వైద్యాధికారి పి.పావని ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, పరిశుభ్రత పాటించాలని సూచించారు. వ్యాధులపై గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సిహెచ్ఒ ఎస్‌వి రమణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సీతానగరం : మండలంలోని చల్లంనాయుడు వలసలో బుధవారం బూర్జ ఆయుర్వేద వైద్యులు యామాక్షి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్య పరీక్షలు చేసి, ఆమె మందులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వి.వారమ్మ, మాజీ సర్పంచ్ పారినాయుడు పాల్గొన్నారు.

పార్వతీపురం రూరల్ : స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా బుధవారం ములగ గ్రామంలో డోకిశిల పిహెచ్‌సి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. సచివాలయ సిబ్బందితోపాటు ఎఎన్ఎం గ్రామంలో క్లోరినేషన్ చేయించారు. గ్రామంలో ఫీవర్ సర్వే చేపట్టి, ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ మడక కృష్ణవేణి విశ్వనాథం దంపతులు పాల్గొన్నారు.

జియ్యమ్మవలస : మండలంలోని ప్రతి గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టాలని పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ జగదీష్ అన్నారు. మన గ్రామం- మన ఆరోగ్యం అన్న భావనతో గ్రామంలో యువత ముందుకు రావాలని కోరారు. బుధవారం చినమేరంగిలో జియ్యమ్మవలస పిహెచ్‌సి ఆధ్వర్యాన వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. అనంతరం గ్రామంలో ఇంటింటికి వెళ్లి డెంగీ, వైరల్ జ్వరాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా డెంగీ వస్తే తలనొప్పి, కీళ్లు, కండరాలు నొప్పి, వాంతులు, చర్మం దద్దుర్లు కనిపిస్తాయని, ఇలాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే అశ్రద్ధ చేయకుండా వైద్యులను సంప్రదించాలని తెలిపారు. అనంతరం గ్రామంలో కాలువల్లో పారిశుధ్య పనులు చేయించారు.



జియ్యమ్మవలస.. పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న వైద్యాధికారి జగదీష్

రక్తదానం.. ప్రాణదానంతో సమానం

ప్రజాశక్తి-వీరఘట్టం

రక్తదానం ప్రాణదానంతో సమానమని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ప్రస్తుత రోజుల్లో రక్తం అందక ఎంతోమంది వివిధ రకాల ప్రమాదాలకు గురైన వ్యక్తులు మృతి చెందుతున్నారని తెలిపారు. బ్లడ్ బ్యాంకుల్లో రక్తం నిల్వ ఉంటే అత్యవసర పరిస్థితుల్లో ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. అనేక ప్రాణాలకు ఊపిరి పోసినట్లు అవుతుందన్నారు. రక్తాన్ని దానం చేసేందుకు ముందుకు వచ్చిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డిజి ఎస్‌వి త్రినాథ్, న్యూ హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండర్ ఎస్.పద్మరాజు, టిడిపి మండల అధ్యక్షులు ఉదయాన ఉదయ భాస్కర్, పట్టణ అధ్యక్షులు జామి లక్ష్మీనారాయణ, బల్ల హరిబాబు, జనసేన ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా సంయుక్త కార్యదర్శి జానీ, మండల విద్యాశాఖ అధికారి డి.గౌరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి-బలిజిపేట

సంపూర్ణత అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండల స్థాయి వ్యాసరచన పోటీలను బుధవారం బలిజిపేట జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒ సామల సింహాచలం మాట్లాడుతూ వ్యాసరచన పోటీల వల్ల విద్యార్థుల్లో ఆలోచనా శక్తి అభివృద్ధి చెందుతుందన్నారు. ఎం.లిఖిత (జెడ్‌పిహెచ్‌ఎస్, చిలకలపల్లి), జి.హేమంత్ కుమార్ (జెడ్‌పిహెచ్‌ఎస్, అరసాడ), కె.స్రవంతి (జెడ్‌పిహెచ్‌ఎస్, చిలకలపల్లి) మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. హెచ్‌ఎం పురజాల శ్రీనివాసరావు సహకారంతో ఎంఇఒ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పి.శ్రీనివాసరావు, శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు సత్యనారాయణ, సునీత, త్రినాధ రావు,అజయ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న ఎంఇఒ సింహాచలం

సీతానగరం : స్థానిక ఎంఆర్‌సిలో బుధవారం మండల స్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఎ.జగదీష్ (గురుకులం, జోగుంపేట), సిహెచ్ స్వప్న (జెడ్‌పిహెచ్‌ఎస్, మరిపివలస), ఎం.రమేష్ (జెడ్‌పిహెచ్‌ఎస్, ఆర్.వెంకంపేట, మొదటి మూడు స్థానాల్లో నిలిచినట్లు ఎంఇఒ సూరిదేముడు తెలిపారు.